
కథ

# పిచ్చుకపై బ్రహ్మాస్త్రం

డా॥ పేటశ్రీ

శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం... అది ఆంధ్రప్రదేశ్‌లోనే అందమైన విశ్వవిద్యాలయం... ఏడు కొండల కింద, వెంకన్న పాదాల చెంత దట్టమైన చెట్ల మధ్య ఆహ్లాదకరమైన ప్రకృతి ఒడిలో వెలసింది... అక్కడక్కడా విసిరేసినట్లుండే హాస్టళ్ళు... మధ్యలో ఒయ్యారం ఒలకబోస్తున్నట్లుండే రోడ్లు... నడుస్తున్న విజ్ఞాన వెలుగుల్లా అటు ఇటూ తిరుగాడుతుండే విద్యార్థులు. అదోలోకం. బాహ్య ప్రపంచానికి భిన్నంగా ఉండే విద్యార్థుల సామ్రాజ్యం...

అప్పుడప్పుడు ఎస్వీ యూనివర్సిటీలోకి జింకలొస్తుంటాయి... దుప్పులు సంచరిస్తుంటాయి. ఇక పాములు, సంద్రగబ్బలు చీమల్లా లెక్కలేనన్ని కనిపిస్తుంటాయి... అడపా దడపా కొండ చిలువలు... చిరుత పులులు... ఎలుగుబంట్లు ప్రవేశించి పత్రికల్లో వార్తలవుతుంటాయి. వీటన్నింటికీ రోజూ సాక్షీభూతమైన మెన్స్ హాస్టల్ హెచ్-బ్లాక్ వర్సిటీ సరిహద్దులో అడవిని ఆనుకొని ఉంటుంది. హెచ్-బ్లాక్ హాస్టల్‌ను ఆధారంగా చేసుకొని బతికే కుక్కల్ని చిరుత పులులొచ్చి విద్యార్థుల ముందే నోట కరచు కొని సమీపంలోని చెట్లెక్కి ఎంచక్కా ఆరగించి కాళ్ళు, తోళ్లను చెట్లకు వేలాడదీసి విద్యార్థులకు థ్రిల్‌ను... వణుకును పుట్టిస్తుంటాయి.



ఎం.ఎస్సీ. జువాలజీ పూర్తి చేసి ఇటీవలే రీసెర్చ్‌లో చేరడానికి రీసెట్ అర్హతను సాధించాడు సత్యం...తాను డే స్కాలర్... రోజూ ఇంటి నుండి వచ్చి వర్సిటీలో చదువుకున్నాడు... అయినా హాస్టల్లో మిత్రులుండడం వల్ల రోజూ కాలక్షేపంగా హాస్టల్‌కొచ్చి కొంతసేపు గడిపి వెళ్తుంటాడు.

యూనివర్శిటీలో పిహెచ్.డి. చేయడానికి సీటు దొరకడమంటే ఆషామాషి కాదు... అది అరుదైన అవకాశం...గైడ్ కరుణా కటాక్షాల మీద ఆధారపడి ఉంటుంది... పరిశోధక విద్యార్థి క్రమశిక్షణ... చదువులో చురుకుదనం... మేధా సంపత్తి... తెలివితేటలు... అణకువ... ఇలాంటివన్నీ చెప్పుకుంటూ పోతే పెద్ద లిస్ట్ అవుతుంది. వీటన్నింటినీ చూసి పిహెచ్.డి.లో చేర్చుకోవడానికి గైడ్‌గా వ్యవహరించే ప్రొఫెసర్ సంతకం చేస్తాడు.

సత్యం రోజూలాగే యూనివర్సిటీకి వచ్చాడు... జువాలజీ విభాగానికెళ్ళాడు... తనకిష్టమైన గురువు ప్రొఫెసర్ రాజేంద్రను కలిశాడు... రాజేంద్రకు కూడా క్లాస్‌రూంలో చలాకీగా ఉండే సత్యమంటే ఎంతో ఇష్టం. తాను ఖచ్చితంగా పిహెచ్.డి.లో సీటు ఇస్తానని రాజేంద్ర సత్యానికి హామీ ఇచ్చాడు. మంచి టాపిక్ ఆలోచించుకొని మరుసటిరోజు మళ్ళీ కనిపించమన్నాడు.

జువాలజీ విభాగం నుండి సత్యం నేరుగా అడవికి అంచునుండే హెచ్-బ్లాక్ హాస్టల్‌కు వచ్చాడు. తన మిత్రుడి రూమ్‌కెళ్ళాడు. తన దగ్గరున్న డూప్లికేట్ 'కీ'తో తలుపు తీసి లోనికెళ్ళి కుర్చీపై కూర్చున్నాడు. తన మనసంతా తాను దేనిపై పరిశోధన చేయాలనే అంశంపైనే నిమగ్నమైపోయింది. ప్రశాంతమైన కొలనులో రాయి వేసినట్లు ఆలోచనల అలలు అలజడిని సృష్టిస్తున్నాయి. అలా కిటికీలో నుండి దృష్టిని సారించాడు సత్యం... ఎదురుగా కనిపిస్తున్న తిరుమల కొండ ఘాట్ రోడ్డుపై వాహనాలు దూసుకొని పోతున్నాయి, తన బుర్రలోని ఆలోచనల్లా. కిటికీకి సమీపంలోని పెద్ద చెట్టు మీద కొన్ని పిట్టలు రణ గొణ ధ్వనులు చేస్తున్నాయి... ఒక పొద నుండి ఇంకో పొదకు కుందేళ్ళు పరుగులు తీస్తూ ఆడుకుంటున్నాయి. సత్యం జారగిలి కుర్చీలో వెనక్కి వాలి, తల పైకెత్తి చూశాడు. వేగంగా ఫ్యాన్ తిరుగుతోంది. దానితోపాటే తన ఆలోచనలు కూడా తిరుగుతున్నాయి. తన చిన్నతనంలో ఇలాగే ఇంట్లో ఫ్యాన్ తిరగడాన్ని చూస్తున్నప్పుడు ఒక పిచ్చుక టపటపమని ఎగురుకుంటూ వచ్చి ఫ్యాన్ రెక్కలకు తగిలి దభేలున కింద పడి గిలగిల

కొట్టుకొని చచ్చిపోయిన సన్నివేశం సత్యానికి గుర్తుకొచ్చింది... ఒక్కసారిగా సత్యానికి పిచ్చుకల మీదకి గాలి మళ్ళింది.

ఒకప్పుడు ఎక్కడ చూసినా పిచ్చుకలే కనిపించేవి. పంట చేలల్లో... పొలంగట్లు మీదుంటే చెట్ల కొమ్మల్లో... ఊర్లల్లో... ఇంటి చూరుల్లో... ప్రతి ముంగిట్లో... కిచ కిచమంటూ మంద్ర సంగీతాన్ని వినిపిస్తుండేవి... వాటి కదలికలు కనువిందును... మనసుకు ప్రశాంతతను చేకూర్చేవి... నేడు అవి ఎందుకు కనుమరుగైపోయాయి... అని అనుకొంటూ ఆలోచనలో పడ్డాడు సత్యం.

ఇంతలో తన మిత్రుడు ప్రసాద్ రానే వచ్చాడు. "ఏరా... సత్యం! ఈ లోకంలో ఉన్నట్టులేవే... ఏదో తన్మయత్వంలో మునిగినట్లున్నావే... కొంపదీసి లవ్‌లో పడ్లేదు కదా?..." అంటూ నిశ్శబ్దాన్ని చీల్చుకొంటూ వచ్చి బెడ్ మీద కూర్చున్నాడు.

"లవ్వులేదు గివ్వులేదు... నీకెప్పుడూ అదే కలవరం... ఒరే! ప్రసాద్ నేను పిచ్చుకల మీద పరిశోధన చేస్తే ఎలా వుంటుంది?"

"జువాలజీ వాళ్ళకు జంతువులు... పక్షులే కదా దిక్కు... ఏ రాయి అయితేనేం పళ్ళు రాలగొట్టుకోవడానికి... నీ ఇష్టం అలాగే కానీయ్" అన్నాడు ప్రసాద్ నవ్వుతూ...

"ప్రసాద్... ప్రస్తుతం పిచ్చుకలు ఎక్కడైనా కనిపిస్తున్నాయా?"

"అవున్రోయ్... ముందు ఎక్కడ చూసినా పిచ్చుకలే పిచ్చుకలు... ఇప్పుడు నువ్వు అడుగుతుంటే గుర్తొస్తోంది... పిచ్చుకల్ని చూసి ఎన్నో ఏళ్ళు అయినట్లుందిరా బాబూ!"

"ఎందుకైనా మంచిది రీసెర్చ్ టాపిక్ నిర్ణయించుకునే ముందు ఈ హాస్టల్ బ్లాక్‌లో ఉండే వాళ్ళనందరినీ అడిగొద్దాం పదా..." అని పైకి లేచాడు సత్యం, అనుసరించాడు ప్రసాద్.

హెచ్- బ్లాక్ హాస్టల్లో కనిపించిన వాళ్ళందరినీ "మీ వూర్లో పిచ్చుకలు కనిపిస్తున్నాయా?" అని అడగడం మొదలుపెట్టారు సత్యం, ప్రసాద్‌లు.

చాలా మంది తెల్లమొఖాలేశారు. ఒక్కసారిగా అడిగేసరికి వెంటనే నిర్ధారించి చెప్పలేకపోయారు. "మేం చూసి చాలా రోజులైంది. ఒకటో, అరో ఉంటాయేమో? ఈసారి మా వూరెళ్ళి గమనించి చెప్తాం" అన్నారు కొంతమంది.

"ఈ మధ్య కాలంలో మాకు పిచ్చుకలు కనిపించడం లేదు" అన్నారు మరి కొంత మంది.

అలా ఆ రోజంతా సత్యం కనిపించిన వాళ్ళందరినీ పిచ్చుకల ఉనికిని గురించి వాకబు చేశాడు. మరుసటిరోజు జువాలజీ విభాగానికెళ్ళి ప్రొఫెసర్ రాజేంద్రను కలిశాడు సత్యం.

"ఏమయ్యా సత్యం... ఏ టాపిక్ మీద రీసెర్చ్ చేయాలనుకుంటున్నావు".

"పిచ్చుకల అంతర్ధానం మీద సార్"

ఒక్క క్షణం కళ్ళు మూసుకొని కళ్ళు తెరిచాడు ప్రొఫెసర్ రాజేంద్ర. "గుడ్... మంచి టాపిక్కే... ముందు మా ఇంటా బయటా పిచ్చుకల సవ్వడితో మారుమోగిపోతుండేవి. పిల్లల్లేని ఇళ్ళు కూడా పిచ్చుకల సందడితో కళకళలాడుతుండేవి. ఏ చెట్టు చూసినా పిచ్చుకల గూళ్ళు కాయలు కాసినట్లుండేవి. మా చిన్నప్పుడు ఆ గూళ్ళు తీసుకొచ్చి పరిశీలించేవాళ్ళం. పిచ్చుకలు పెద్ద ఇంజనీర్లులా గూళ్ళను ఎంతో కళాత్మకంగా అల్లుతాయి... అంత చిన్న మస్తిష్కంలో అంత గొప్ప పనితనాన్ని దేవుడెలా ఇచ్చాడో అని అనుకునేవాళ్ళం. చిన్నప్పుడు ఇసుకలో ఆడుతూ పాదంపై ఇసుకను గూడులా చేసి పిచ్చుగ్గూళ్ళు ఆటాడేవాళ్ళం... మా ఇళ్ళ తావులు, దంతెలకు చెక్కతో చేసిన గూళ్ళను అమర్చేవాళ్ళం... పండిన వరి తొలి ఎన్నులను తీసుకొచ్చి జడకుచ్చుల్లా అల్లి గూళ్ళముందు వేలాడదీసేవాళ్ళం...

**తన చిన్నతనంలో ఇలాగే ఇంట్లో ఫ్యాన్ తిరగడాన్ని చూస్తున్నప్పుడు ఒక పిచ్చుక టపటపమని ఎగురుకుంటూ వచ్చి ఫ్యాన్ రెక్కలకు తగిలి దభేలున కింద పడి గిలగిల కొట్టుకొని చచ్చిపోయిన సన్నివేశం సత్యానికి గుర్తుకొచ్చింది... ఒక్కసారిగా సత్యానికి పిచ్చుకల మీదకి గాలి మళ్ళింది.**


తర్వాత పిచ్చుకలొచ్చి కాపురాలు చేసేవి... మనిషి జీవితంలో పిచ్చుకలు విడదీయరాని అనుబంధాన్ని ఏర్పరచుకున్నాయి... అలాంటిది ఉన్నట్టుండి పిచ్చుకలు ఒక్కసారిగా ఎందుకు అంతర్ధానమై పోతున్నాయో అంతుపట్టడం లేదు".

"అవును సార్! మా చిన్నప్పుడు మా ఇంటి ముందు ఎన్నో పిచ్చుకలు రయ్ రయ్ మంటూ వచ్చి వాలేవి. మా అమ్మ చేటలో బియ్యం చెరిగేటప్పుడు ఒడ్లు ఏరి కిందేస్తుంటే పిచ్చుకలు పొటుకు పొటుకుమని ముక్కుతో పొడిచి పొట్టును వేరుచేసి గింజలను తింటుంటే మేం గుడ్లప్పగించి చూసేవాళ్ళం. మాకు అదే పెద్ద వినోదం. ఇంట్లోని అద్దం ముందు వాలి తమ ప్రతిబింబాన్ని చూసి, మరో పిచ్చుక వచ్చినట్లుగా భ్రమపడి అద్దంలో కనిపించే పిచ్చుకను టపటపమని ముక్కుతో పొడుస్తుంటే మా నవ్వులు పువ్వులై విరిసేవి" అన్నాడు సత్యం.

"ఒక పని చెయ్... ముందు పిచ్చుకల పుట్టుక, జీవన విధానాన్ని, వాటి ఆహారం, శృంగారం, నివాసాల గురించి, ఆ తర్వాత వాటి అంతర్ధానానికి సంబంధించిన అంశాలను గురించి అన్ని వివరాలు సమగ్రంగా సేకరించి ఒక నివేదికను తెచ్చివ్వు" అని ఆదేశించాడు ప్రొఫె సర్ రాజేంద్ర. రెండు నెలలు కష్టపడి పిచ్చుకల జీవితాన్ని గూర్చి, వాటి అంతర్ధానం గూర్చి అన్ని కోణాలను పరిశీలించి సత్యం నివేదికను రూపొందించి ప్రొఫెసర్ రాజేంద్రకిచ్చాడు.

"సెల్ టవర్ల రేడియేషన్ వల్ల పిచ్చుకలు కనుమరుగైపోతున్నాయంటావ్?"

"అవును సార్! సిగ్నల్ టవర్స్‌ను చట్ట ప్రకారం ప్రభుత్వ లైసెన్స్ తీసుకొని నెలకొల్పాలి. పాఠశాలల సమీపంలో అసలు సిగ్నల్ టవర్స్ ఉండకూడదు. ఆ టవర్స్



నుండి వెలువడే రేడియేషన్ వల్ల పిల్లలకు పెద్దయ్యాక వంధ్యత్వం ప్రాపిస్తుంది. అందుకే నేడు చాలా మంది స్త్రీ, పురుషులు సంతాన వైఫల్యంతో సతమతమౌతున్నారు. ఆత్మహత్యలు చేసుకొంటున్నారు. డాక్టర్ల దగ్గరకెళ్లి సంతాన సాఫల్యం కోసం లక్షలు ఖర్చు పెట్టుకుంటున్నారు. లైసెన్స్ పొందిన టవర్లవారు కూడా తమ ఫ్రీక్వెన్సీని విపరీతంగా పెంచేసి సొమ్ము చేసుకుంటున్నారు. వీటి గురించి సాధారణ ప్రజలకు అవగాహన లేదు... అడిగేవారే లేరు. మానవాళినే మట్టు పెడ్తున్న ఈ సిగ్నల్ టవర్ల రేడియేషన్ పశు పక్ష్యాదుల మీద ఎంతటి దుష్ప్రభావాన్ని చూపిస్తున్నదో తలచుకుంటేనే భయమేస్తోంది... ఈ సెల్ టవర్లు వచ్చినప్పటి నుండే పిచ్చుకజాతి సంతానోత్పత్తిని కోల్పోయాయి. తత్ఫలితంగా ఇవి కనుమరుగైపోతున్నాయని ఖచ్చితంగా చెప్పగలను సార్! నోరుండే మానవుడే స్వార్థంతో ప్రతిఘటించకపోతుంటే... నోరు లేని జీవాలు అంతరించిపోక ఎలా ఉంటాయి సార్... శృంగారంలో పిచ్చుకలు పాల్గొన్నన్నిసార్లు మరే పశు పక్ష్యాదులు పాల్గొనవు. వాటికి సంతతి కూడా... ఎక్కువే... అయినా పిచ్చుకలు దాదాపు కనుమరుగైపోయాయి... ఎక్కడో సెల్ టవర్లు లేని పల్లెల్లో... సిగ్నల్స్‌కు దూరంగా ఉండే అడవుల్లో పదుల సంఖ్యల్లో పిచ్చుకలను చూడడం మహా భాగ్యం గా ఉంది సార్!!" అంటూ ఆవేదనతో నివేదికలోని విషయాలను చెప్పాడు సత్యం.

ప్రొఫెసర్ రాజేంద్రకు కళ్ళల్లో నీళ్లు తిరిగాయి. "ఈ సెల్ టవర్ల రేడియేషన్ పిచ్చుకపై బ్రహ్మాస్త్రంగా పని చేస్తుంటే ఆ జాతి సమూలంగా తుడిచిపెట్టుకొనిపోతుంది... పర్యావరణవేత్తలు ఎంత మొత్తుకొంటున్నా ప్రపంచంలోని అన్ని దేశాలు కర్బన ఉద్గారాలను అధిక మొత్తంలో విడుదల చేస్తూనే ఉన్నాయి... ఇటీవల డెన్మార్క్‌లోని కోపెన్‌హాగన్‌లో జరిగిన సదస్సుల్లో కూడా అన్ని దేశాలు గ్లోబల్ వార్మింగ్‌ను గూర్చి హెచ్చరిస్తూనే తమ బాధ్యతల నుండి తప్పించుకున్నాయి... సదస్సు ధ్యేయం నెరవేరనేలేదు... కర్బన ఉద్గారాల విడుదలను తగ్గించుకొంటే అసలే ఆర్థికమాంద్యంతో సతమతమౌతున్న తమ దేశాలు మరింత పతనావస్థకు చేరుకుంటాయని వాటి భయం... మానవుడు తానెక్కిన కొమ్మనే తెలిసి తెలిసి నరుక్కుంటున్నాడు... ప్రపంచాన్ని వేడెక్కిస్తున్నాడు... నేడు పిచ్చుకలు... రేపు మరికొన్ని పశుపక్ష్యాదులు... ఆ తర్వాత మానవులే కనుమరుగైపోక తప్పదు... అసలీ ప్రపంచమే ఏమైపోతుందో ఏమో..." అని అంటూ బాధతో కుర్చీలో జారగిలివాలాడు ప్రొఫెసర్ రాజేంద్ర.

"సార్! ఈ విషయాలన్నింటినీ ప్రజలకు తెలియజేసి, వారిని చైతన్యపరచాల్సిన




అవసరమెంతైనా ఉంది... పరిశోధనకన్నా, సామాజిక బాధ్యతే మిన్న... మీరు సరేనంటే నేను ఆ పని చేస్తాన్ సార్!" అన్నాడు సత్యం.

"సరే నీ యిష్టం" అన్నాడు ప్రొఫెసర్.

***

ముందుగా సత్యం సెల్ టవర్ల రేడియేషన్‌పై కోర్టులో కేసు వేశాడు. కోర్టు దీన్ని తీవ్రంగా స్పందించి లైసెన్స్ ఉండే సెల్‌టవర్లు ఎన్ని? వాటి ఫ్రీక్వెన్సీ ఎంత? తెలియజేయాల్సిందిగా ఆదేశాలు జారీ చేసింది. అయినా సత్యానికి తృప్తి కలగలేదు.

ఏ సెల్ టవర్ల వల్ల సమస్త జీవరాశికి హాని కల్గుతోందో... ఆ సెల్ టవర్లనెక్కి తన నిరసనను తెల్పాలనుకున్నాడు సత్యం. యూనివర్సిటీకి ముందు వైపుండే సెల్ టవర్‌ను ఎక్కి పర్యావరణ పరిరక్షణ కోసం ముద్రించిన కరపత్రాలను వెదజల్లడం ప్రారంభించాడు సత్యం. జనమంతా టవర్ కింద పోగయ్యారు. ఆత్మహత్య చేసుకోవద్దంటూ అరిచారు... ఇంతలో పోలీసులు రంగప్రవేశం చేసి సత్యాన్ని టవర్ నుండి కిందికి దింపి... ఆత్మాహత్యానేరం కింద అరెస్ట్ చేశారు.

"సార్! నేను ఆత్మహత్య చేసుకోవడానికి ఎక్కలేదండి... చచ్చి సాధించేదేమీ లేదు... బతికి సాధించాలి... అన్ని ప్రాణుల మనుగడే నా ధ్యేయం... ఇందులో భాగంగా ప్రజలను జాగృతం చేయడానికి, వారి దృష్టిని నా పైకి మళ్ళించి, కరపత్రాలపై స్పందించేటట్లు చేయడానికి సెల్ టవర్‌ను ఎక్కాను సార్" అంటూ పోలీసులకు చెప్పాడు. అయినా పోలీసులు ఆయా సెల్ టవర్ల సంస్థలతో కుమ్మక్కై సత్యాన్ని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపారు. యూనివర్సిటీ అధికారులు పోలీసు కేసుల్లో ఇరుక్కున్న సత్యానికి పిహెచ్.డి.లో సీటు ఇవ్వడానికి అంగీకరించలేదు.

జువాలజీ విభాగానికి విజిటింగ్ ప్రొఫెసర్‌గా అమెరికా నుండి వచ్చిన డేవిడ్ విల్సన్ ప్రొఫెసర్ రాజేంద్ర గదిలో కూర్చొని పరిశోధనల గురించి మాట్లాడుతూ రాజేంద్ర టేబుల్‌పై ఉన్న సత్యం పరిశోధనా నివేదికను చూశాడు. "దిస్ ఈజ్ వండర్‌ఫుల్ రిపోర్ట్... హూ ఈజ్ దిస్ ఫెలో" అంటూ వివరాలడిగాడు డేవిడ్ విల్సన్. రాజేంద్ర అన్ని వివరాలు చెప్పాడు.

***

జువాలజీ విభాగానికి విజిటింగ్ ప్రొఫెసర్‌గా అమెరికా నుండి వచ్చిన డేవిడ్ విల్సన్ ప్రొఫెసర్ రాజేంద్ర గదిలో కూర్చొని పరిశోధనల గురించి మాట్లాడుతూ రాజేంద్ర టేబుల్‌పై ఉన్న సత్యం పరిశోధనా నివేదికను చూశాడు.

"దిస్ ఈజ్ వండర్‌ఫుల్ రిపోర్ట్... హూ ఈజ్ దిస్ ఫెలో" అంటూ వివరాలడిగాడు డేవిడ్ విల్సన్. రాజేంద్ర అన్ని వివరాలు చెప్పాడు.

"ఇంత గొప్ప మేధావిని... పరిశోధకుణ్ణి... కమిట్‌మెంట్ ఉన్నవాడిని గాలికి వదలిపెట్టకూడదు... మీకెలాంటి అభ్యంతరం లేకపోతే సత్యాన్ని మా దేశానికి తీసుకెళ్ళి నా దగ్గర పరిశోధన చేయిస్తాను... అతనికి ఫెలోషిప్పు ఇప్పిస్తాను... వీసా సంగతిని నేనే స్వయంగా చూస్తాను... నాతోపాటు తీసుకెళ్తాను... అతనితో మాట్లాడి ఒప్పించండి" అన్నాడు డేవిడ్ విల్సన్.

రాజేంద్ర ఆనందంతో ఉప్పొంగిపోయాడు... సత్యాన్ని పిలిపించాడు... మొదట్లో సత్యం సంకోచించాడు...

"నా మాట విను సత్యం... నీ ప్రతిభాపాటవాలు గుర్తించి అమెరికన్ ప్రొఫెసర్ నిన్ను కోరుకుంటున్నాడు. పరిశోధనలో నీ శక్తియుక్తుల్ని అంచనా వేశాడు... నీకు అన్నీ సమకూర్చి నీ చేత పరిశోధనలు చేయిస్తాడు. అమెరికాలో పిహెచ్.డి. చేస్తే నీకు ఎంతో పేరు వస్తుంది" అని ఒప్పించాడు.

"మన దేశం ఒక మేధావిని కోల్పోయింది" అని నిట్టూర్చాడు రాజేంద్ర. ●